క్లుప్తంగా

కూలీల సమస్యలు పట్టవా?



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

రొద్దం: మండల పరిధిలోని ఆర్ లోచెర్ల, కోత్తూరు, కంచిసముద్రం తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనుల వద్ద ఎర్రటి ఎండలు ఉన్నా ఎక్కడా నీడకు టెంట్లు ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. నాలుగు వారాలు గడుస్తున్నా కూలీలకు బిల్లులు పడలేదన్నారు. వారం రోజులు పనిచేసిన కూలీలకు 4 రోజులు మాత్రమే మస్టర్‌లో పేర్లు నమోదు చేస్తున్నారని కూలీలు ఆరోపించారు. శ్రమ శక్తి సంఘాలు ఎక్కడా ఏర్పాటు చేయలేదన్నారు. కూలీల సమస్యలపై బుధవారం ఆర్ లోచెర్ల గ్రామ సచివాలయం వద్ద ధర్నా చేస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న తెలిపారు. కూలీలు పెద్ద సంఖ్య పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం

హిందూపురం టౌన్: పరిగి మండలంలోని విరుపాపురం క్రాస్ రోడ్డులో మంగళవారం హిందూపురం మండలం మణేసముద్రం గ్రామానికి చెందిన నరసింహులు ద్విచక్ర వాహనంలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు పుట్టపర్తి ఎక్సైజ్ ఈఎస్‌టీఎఫ్ సీఐ హరికృష్ణ, ఎస్‌ఐ సింహా తెలిపారు. అతని వద్ద నుంచి 480 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది కృష్ణ, గౌస్, మల్లికార్జున, భరత్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



యల్లమ్మదేవి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలో వాల్మీకి సర్కిల్ వద్ద ఉన్న రేణుకా యల్లమ్మదేవి ఆలయ 25వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం ఉదయమే మూలవిరాట్ యల్లమ్మదేవికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం గణపతి, నవగ్రహ శాంతి హోమం, దుర్గా, లక్ష్మి తదితర హోమాలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తిని అలంకరించి మేళతాళాలతో నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

గాంధారి విద్యతో జ్ఞాపక శక్తి



కాళ్లతో వస్తువులను గుర్తు పడుతున్న చిన్నారి

పావగడ: గాంధారి విద్యను అను నిత్యం అభ్యసిస్తే చిన్నారుల్లో జ్ఞాపకశక్తి పెరుగు తుందని, చదువులో రాణిస్తారని గాంధారి విద్య శిబిర నిర్వాహకులు స్థానిక బ్రైట్ ఫ్యూచర్ శిక్షణ కేంద్రం సీఈఓ శ్రీధర్ గుప్త తెలిపారు. ఆయన మాట్లాడుతూ 8 నుంచి 16 ఏళ్లలోపు ఉన్న విద్యార్థులు గాంధారి విద్య నేర్చుకునేందుకు అర్హులన్నారు. కేవలం 10 రోజుల వ్యవధిలోనే గాంధారి విద్య నేర్పిస్తామన్నారు.

హజ్‌యాత్రకు బయలుదేరిన ముస్లింలు

హిందూపురం: పట్టణం నుంచి హజ్‌యాత్రకు 91 మంది ముస్లింలు మంగళవారం రాత్రి బయలుదేరారు. బెంగళూరు హజ్ భవన్‌లో మంగళవారం రాత్రి ఎమ్మెల్సీ మహమ్మద్ షరీఫ్, మౌలానా ముస్తక్ అహ్మద్, హజ్ కమిటీ చైర్మన్ హసన్‌బాషాసాబ్ ముగ్గురు బెంగళూరుకు చేరుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేసి యాత్రకు సంబంధించి నియమాలు, సదుపాయల గురించి వివరించారు.

వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం

వీరజవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని పరామర్శించేందుకు గోరంట్ల మండలం కల్లి తండాకు వచ్చిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. రాష్ట్ర సరిహద్దులోని బాగేపల్లి టోల్‌ప్లాజా వద్ద నుంచి కల్లి తండా వెళ్లే వరకూ.. అలాగే తిరిగి రాష్ట్ర సరిహద్దు దాటే వరకూ జాతీయ రహదారుల వెంట, అలాగే ప్రతి గ్రామంలోనూ అభిమానులు ఘన స్వాగతం పలికారు. జై జగన్ అంటూ ఎంతో ఉత్సాహంతో ఆయన్ను చూసి కేరింతలు కొట్టారు. అన్ని ప్రాంతాల్లో ఎంతో ఓపికగా మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రజలు, అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. చిన్నారులు, మహిళలు, అభిమానులతో కరచలనం చేసి ఉత్సాహ పరిచారు.



గుమ్మయ్యగారిపల్లి క్రాస్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్

చిలమత్తూరు: రాష్ట్ర సరిహద్దులోని బాగేపల్లి చెక్‌పోస్టు వద్ద వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. కల్లి తండా పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం ఆయన బాగేపల్లి చెక్‌పోస్టు వద్దకు చేరుకోగా అప్పటికే అక్కడికి చేరుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, వైఎస్సార్ సీపీ హిందూపురం నియోజకవర్గ నేత వేణురెడ్డి, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి, ఏపీ ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్ నిశ్చల్, వైఎస్సార్ సీపీ చిలమత్తూరు, లేపాక్షి మండల కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, సయ్యద్ నిస్సార్, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, చవ్వా రాజశేఖర్‌రెడ్డి, 'పురం' మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆసిఫ్, మహేష్ గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, కవితారెడ్డి, ప్రణయ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రోషన్ అలీ, గిరి, సర్పంచ్‌లు జయశంకర్‌రెడ్డి, ఎంపీటీసీలు జగన్‌మోహన్‌రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: వీరజవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని పరామర్శించేందుకు గోరంట్ల మండలం కల్లి తండా పర్యటనకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పాలసముద్రం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు అభిమానులు ఘన స్వాగతం పలికారు. వైఎస్ జగన్ రెండు చేతులు జోడించి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు వెళ్లారు. మహిళలు, చిన్నారులు ఎండను సైతం లెక్కచేయకుండా నడిరోడ్డుపై జాతీయ జెండాలు పట్టుకుని నిలబడి వైఎస్ జగన్‌కు స్వాగతం పలికారు.



బాలుడికి షేక్‌హ్యాండ్ ఇస్తున్న వైఎస్ జగన్



అదిగదిగో జగనన్న..



బాగేపల్లి టోల్‌ప్లాజా వద్ద వైఎస్ జగన్‌కు బొకేలు ఇచ్చేందుకు పోటీపడుతున్న అభిమానులు



జాతీయ జెండా, వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటాన్ని ప్రదర్శిస్తున్న అభిమానులు



మహిళలకు షేక్‌హ్యాండ్ ఇస్తున్న వైఎస్ జగన్



వైఎస్ జగన్‌ను చూసేందుకు అభిమానుల పరుగు



చిలమత్తూరు: 'ఆంధ్ర పీపుల్స్ హార్ట్ బీట్ మై జగనన్న' పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, వేణురెడ్డి, చౌళూరు మధుమతిరెడ్డి తదితరులు



సోమందేపల్లి: ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్



పాలసముద్రం వద్ద వేచి చూస్తున్న అభిమానులు

కల్లి తండాకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పెనుకొండ రూరల్: వీరజవాన్ మురళీనాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్లి తండాకు వస్తుండటంతో పెనుకొండ మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కల్లి తండాకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. గుట్టూరు, మునిమడుగు, కురుబవాండ్లపల్లి, వెంకటగిరిపాళ్యం, గొల్లపల్లి గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. వైఎస్సార్‌సీపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, మల్లిరెడ్డి, అశ్వర్థరెడ్డి, వెంకటేష్, పిట్టా బాబు, మజ్జిగ నాగరాజు, ఎం శ్రీనివాసులు, నటేష్, హనుమంతరెడ్డి, ఆదినారాయణ, బోయ శంకర్, శ్రీధర్, చంద్రానాయక్, కర్రా సంజీవరెడ్డి, పోతిరెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నియోజకవర్గం నుంచి పార్టీ కమిటీల అధ్యక్షులు, మండల కన్వీనర్లు ,నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో మంగళవారం కల్లి తండాకు తరలివెళ్లారు. వైఎస్ జగన్‌ను కలిశారు. అనంతరం వీర జవాన్ సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పార్టీ అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, ఉషశ్రీచరణ్ లను కలిశారు.



పెనుకొండ నుంచి కల్లి తండాకు బయలుదేరి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మడకశిర నుంచి కల్లి తండాకు వెళ్తున్న నాయకులు

వీరజవాన్‌కు ఘన నివాళి



వీరజవాన్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న రొళ్ల వైఎస్సార్‌సీపీ నాయకులు

రొళ్ల: గోరంట్ల మండలం కల్లి తండాలో వీరజవాన్ మురళీనాయక్ సమాధి వద్ద మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పుష్పగుచ్ఛాలు ఉంచి మంగళవారం నివాళులర్పించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనలో భాగంగా ఆయనకు మద్దతుగా రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు స్థానిక నాయకులతో కలిసి మురళీనాయక్ సమాధి వద్దకు చేరుకుని గౌరవ వందనం సమర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో గుడిబండ జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, నాయకులు మూర్తి, మాళేగౌడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కల్లి తండాకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వీరజవాన్ మురళీనాయక్ సమాధి వద్ద నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, మడకశిర నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివకుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు దేవగానపల్లి శివకుమార్, ఎంపీటీసీ నరసింహమూర్తి, నాయకులు చిత్తన్న, మంజునాథ తదితరులు పాల్గొన్నారు.



మురళీనాయక్ సమాధి వద్ద సెల్యూట్ చేస్తున్న అమరాపురం వైఎస్సార్‌సీపీ నాయకులు

రిట్ పిటిషన్ పరిగణనలోకి తీసుకోండి

- 'పురం' కమిషనర్ శ్రీనివాసులు కేసులో హైకోర్టు ఆదేశం

చిలమత్తూరు: హిందూపురం మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు అర్హత లేకున్నా రాజకీయ పలుకుబడితో కమిషనర్ పదవి పొందడాన్ని సవాల్ చేస్తూ ఏపీ హైకోర్టులో శ్రీధర్ అనే వ్యక్తి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్ ఈ నెల 9న హియరింగ్‌కు రాగా రిట్ పిటిషన్ వేసిన శ్రీధర్ వినతిని పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. అయితే ఈ అంశంపై ప్రభుత్వ ప్లీడర్ కౌంటర్ దాఖలుకు సమయాన్ని కోరారు. హైకోర్టు వచ్చే నెల 26 లోపు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఇదిలా ఉండగా.. డీఆర్‌డీఏలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులును ఏకంగా స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా నియమించడం సంచలనంగా మారింది. కనీస విద్యార్హత లేని వ్యక్తికి ఎలా గెజిటెడ్ స్థాయి పదవి కట్టబెట్టారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కేవలం టీడీపీ నేతలకు ఉపయోగపడేందుకు ఆయనకు అవకాశం ఇచ్చారన్న విమర్శలున్నాయి.

బదిలీ ఉద్యోగికి సన్మానం

అమరాపురం: ఉపాధి హామీ పథకంలో మండల పరిధిలోని మద్దనకుంట గ్రామ పంచాయతీ టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై అగళి ఏపీఓగా వెళ్లిన మంజునాథను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఏఓ విశ్వేశ్వరారాధ్య, ఏపీఓ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

17న మండల మీట్

పరిగి: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 17న ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రెడ్డెప్ప ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, కోఆప్షన్ మెంబర్‌తో పాటూ మండల వ్యాప్తంగా ఉన్న సర్పంచ్, ఎంపీటీసీలంతా తప్పకుండా హాజరుకావాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు.

25న వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

పెనుకొండ: జిల్లాలో పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాల్మీకి విద్యార్థులకు ఈ నెల 25న ఉత్తమ ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ శివయ్య ఓ ప్రకటనలో తెలిపారు. పెనుకొండ పట్టణంలోని మిట్టాంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నామన్నారు. 10వ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు 450 మార్కుల పైన, ప్రైవేట్ పాఠశాలలో చదివిన విద్యార్థులు 500 మార్కులు పైన వచ్చి ఉండాలన్నారు. ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులు 750 మార్కులు పైన, ప్రైవేట్ కళాశాలలో చదివిన వారు 850 మార్కులు పైన వచ్చి ఉండాలన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 18లోగా 8919121041 నంబర్‌కు వాట్సాప్ ద్వారా మార్కుల మెమోతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రెండుగా చీలిన టీడీపీ నేతలు

- చిలమత్తూరు మండల కన్వీనర్ పదవికి పోటాపోటీ
- తలపట్టుకుంటున్న ఎమ్మెల్యే బాలకృష్ణ



చిలమత్తూరు: తెలుగు దేశం పార్టీ మండల కన్వీనర్ ఎంపిక వ్యవహారంతో ఆ పార్టీ నాయకులు రెండుగా చీలిపోయారు. ఏకంగా 16 మంది పోటీ పడుతుండటంతో ఎవరికి పదవి ఇవ్వాలో తేల్చుకోలేక ఎమ్మెల్యే బాలకృష్ణ తలపట్టుకుంటున్నారు.

ప్రస్తుత కన్వీనర్‌పై అసంతృప్తి

ప్రస్తుత మండల కన్వీనర్ రంగారెడ్డిపై మరో వర్గం అసంతృప్తిగా ఉండటం, పలు అవినీతి ఆరోపణలు, చాలా ఏళ్లుగా కన్వీనర్ మార్పు చేయలేదనే కారణాలతో ఎట్టకేలకు కన్వీనర్ మార్పుకు శ్రీకారం చుట్టారు. దీనికిపై ఎమ్మెల్యే బాలకృష్ణ కూడా స్పష్టమైన ఆదేశాలిచ్చారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే కన్వీనర్ మార్పు విషయమై మంగళవారం ప్రస్తుత కన్వీనర్ రంగారెడ్డికి చెందిన పెట్రోల్ బంక్ సమీపంలో టీడీపీ మండల నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. నూతన కన్వీనర్ ఎంపికలో భాగంగా నేతల అభిప్రాయం పరిగణలోకి తీసుకోవాలనుకున్న ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సూచనలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఏకంగా 16 మంది మండల కన్వీనర్ పదవికి కోసం పోటీ పడుతుండటం తలనొప్పి వ్యవహారంగా మారింది. ఏమి చేయాలో తెలీక ప్రస్తుతానికి మండల కన్వీనర్ ఎంపికను వాయిదా వేసినట్టు తెలుస్తోంది. టీడీపీలో మండల కేంద్రానికి చెందిన టీడీపీ నాయకుడు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ యాదవ్, బేకరీ గంగాధర్, మాజీ ఎంపీపీ శివప్ప తనయ శ్రీదేవి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే వీరిలో ఎవరికి వారు తమ ప్రయత్నాల్లో బిజీగా ఉన్నారు. కాగా వర్గ విభేదాలు కారణంగా టీడీపీలో రెండు గ్రూపులుగా విడిపోవడం ఎమ్మెల్యే బాలకృష్ణకు తలనొప్పిగా మారింది.

ముక్కు మూసుకోవాల్సిందే ..



జాతీయ రహదారి పక్కన జంతు కళేబరాలను పారవేసిన దృశ్యం

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారి గుట్టూరు సమీపంలోని బన్నీ గార్డెన్‌కు కూతవేటు దూరంలో చనిపోయిన రెండు ఎద్దుల కళేబరాలను పడేశారు. రెండు మృతదేహాలు కుళ్లిపోవడంతో ఆ ప్రాంతమంతా కంపు కంపుగా మారింది. పెనుకొండ నుంచి అనంతపురం వైపు ప్రయాణించే వాహనదారులు ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. పంచాయతీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'సహాయ వాణి'ని సద్వినియోగం చేసుకోండి

పావగడ: స్థానిక తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయవాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ వరదరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాలూకా స్థాయిలో ఎలాంటి ప్రమాదాలు, ఇబ్బందులు చోటు చేసుకున్నా వెంటనే తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయవాణి 08136244242 నంబరుకు ఫోను చేసి ప్రజలు సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

ఇద్దరికి గాయాలు

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన పెనుకొండ 44వ జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకొంది. స్థానికుల వివరాల మేరకు.. ధర్మవరానికి చెందిన వ్యాపారి బండి శ్రీనివాసులు, ఆటోడ్రైవర్ రాజారాంతో కలసి వ్యాపార నిమిత్తం మంగళవారం తెల్లవారుజామున పావగడకు ఆటోలో బయలుదేరారు. అయితే మార్గమధ్యలో జాతీయ రహదారి గుట్టూరు సమీపంలోకి రాగానే ఆటోను వెనుక నుంచి టాటాఏస్ వాహనం ఢీ కొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న రాజారాం, శ్రీనివాసులు గాయపడ్డారు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో వారిని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.